క్లుప్తంగా

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

వీరఘట్టం: మండల కేంద్రంలోని గణలక్ష్మీ సంతోషిమాత ఆలయ 15వ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీరాములు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ బొడ్లగూడ గ్రామంలో 100 మంది గిరిజనులకు పార్వతీపురం మన్యం జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు గురువారం దుప్పట్లు, దోమతెరలు, శానిటైజేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా సేవా కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలో ఎల్లమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో అమ్మవారి ఘటాలను డప్పువాయిద్యాలతో ఊరేగించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి..

● నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు



వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి దుకాణదారులు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మార్కెట్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలిథిన్ ఉత్పత్తులకు బదులుగా బయో డీ గ్రేడబుల్ బ్యాగ్‌లను వినియోగించాలని కోరారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హిందీ జాతీయ భాష..



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: హిందీ జాతీయ భాష అని పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. పాఠశాలలో సంస్కృత, హిందీ భాషా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత ఉపాధ్యాయుడు బొరోతు శంకరరావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే హిందీ భాషపై పట్టు సాధించాలన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.



జగనన్నను చూసేందుకు ఉత్సాహంగా వస్తున్న యువత



ప్రజలకు అభివాదం చేస్తున మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి

పులకించిన పాలకొండ..

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాకతో పాలకొండ పట్టణం పులకించింది. జగనన్నను చూసేందుకు వేలాది సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. పట్టణం, మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోటెత్తడంతో పాలకొండ జనసంద్రమైంది. జై జగన్ నినాదాలతో పట్టణం మార్మోగింది. ఎటువంటి రాజకీయ కార్యక్రమం కానప్పటికీ స్వచ్ఛందంగా ప్రజలు తండోపతండాలుగా రావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వచ్చింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా రహదారికి ఇరువైపులా.. భవనాలు, చెట్లపైకి ఎక్కి నిలబడిన ప్రజానీకానికి జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం తెలిపారు. ప్రత్యేకించి యువత, మహిళలు సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. అలాగే నియోజకవర్గ నాయకులకు జగన్‌మోహన్ రెడ్డిని స్వయంగా కలిసే అవకాశం రావడంతో ఉబ్బితబ్బియ్యారు

-పాలకొండ/ పాలకొండ రూరల్

'జ్ఞానజ్యోతి' లక్ష్యాలను సాధించాలి

● సమగ్ర శిక్ష ఏపీసీ తేజేశ్వరరావు



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ తేజేశ్వరరావు

వీరఘట్టం: అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి ట్రెనింగ్ ప్రొగ్రాం లక్ష్యాలను సాధించాలని సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల సమగ్ర విద్యాభివృద్ధికి, భాష, అక్షరాస్యత, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న కృత్యాలను అంగన్‌వాడీ కేంద్రాలలో విధిగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు సమగ్ర శిక్ష ఏపీఓ వై.హరిప్రసాద్, ఎంఈఓ ఆర్.ఆనందరావు, నాగమణి, మజ్జి పైడిరాజు, ఆర్.ధనుంజయనాయుడు, బి.రాజేష్, సూపర్‌వైజర్లు ఎస్.రాజేశ్వరి, ఎ.జ్ఞానమ్మ, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతులు వెలిగించాలి..



భామిని: మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కరరావు

భామిని: అంగన్‌వాడీ చిన్నారుల్లో జ్ఞానజ్యోతులు వెలిగించాలని ఎంఈఓ వి.భాస్కరరావు అన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. సీడీపీఓ శాంతిభవానీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌పీలు కె.గోవిందరావు, బి.అప్పారావు, కె.క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



లబ్ధిదారురాలికి బీమా చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ నరేష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన శంబంగి పద్మావతికి కురుపాం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.నరేష్ కుమార్ గురువారం ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ మేరకు పద్మావతి భర్త శంబంగి సింహాచలం ఇటీవల మృతి చెందారు. సింహాచలం తన పేరున పీఎంజేజే బీమాను తమ బ్యాంకు వద్ద కట్టి ఉండటంతో ఆయన మరణానంతరం బీమా నగదును అందజేస్తున్నట్లు మేనేజర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఈ పథకం ద్వారా నగదు అందడం కష్టాల్లో ఉన్న తమ కుటుంబానికి ఎంతో భరోసా లభించనుందని మృతుని భార్య పద్మావతి ఆనందం వ్యక్తం చేసింది.

తలవరం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ అమోఘం

● ఏపీసీ తేజేశ్వరరావు



డిబేట్‌లో తృతీయ స్థానం సాధించిన ప్రియాంకకు బహుమతి అందజేస్తున్న ఏపీసీ తేజేశ్వరరావు

వీరఘట్టం: మండలంలోని తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ అమోఘమని సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు అన్నారు. తలవరం హైస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడంపై అభినందించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. అంతేకాకుండా పార్వతీపురం కేపీఎం హైస్కూల్‌లో జరిగిన స్వర్ణాంధ్ర-2047 డిబేట్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని ప్రియాంకను అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఫెయిర్‌లో విజేతలుగా నిలిచిన డి.నితిస్‌కుమార్, పి.గోవిందరావు, గైడ్ రామారావు, వై.జగన్, పోతురాజు శంకరరావు, మాచర్ల రఘు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఆరోగ్య సర్వే



ఉల్లిబద్రలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: ఆరోగ్య సర్వేను సక్రమంగా నిర్వహించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో గురువారం ఆకస్మికంగా సందర్శించి ఆరోగ్య సర్వేను పరిశీలించారు. ఎన్‌సీడీ, స్కూల్ హెల్త్, లెప్రసీ, అంగన్‌వాడీ, ఇతర వ్యాధుల గుర్తింపునకు సంబంధించి సర్వే, స్క్రీనింగ్ ఏ మేరకు చేపడుతున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధుల గుర్తింపు కోసం చేపడుతున్న ఎన్‌సీడీ సర్వేను ఆయన పరిశీలించారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌పై దృష్టి సారించాలన్నారు. పాఠశాలను సందర్శించి హెల్త్ స్క్రీనింగ్ వివరాలు రికార్డులలో పరిశీలించి, హిమోగ్లోబిన్ శాతం నివేదికలు, భవిత కార్డులో నమోదు తీరును పరిశీలించారు. లెప్రసీ సర్వేలో ఎంతమంది అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించారని ప్రశ్నించారు. గతంలో గుర్తించిన సికెల్‌సెల్ ఎనీమియా విద్యార్థి ఆరోగ్య వివరాలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం కోసం చేస్తున్న సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, వైద్య సిబ్బంది కె.అనిత, మాలతి, ఆశ వర్కర్లు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి సూచనలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

భామిని: రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ ఎన్.అప్పారావు, డీటీలు రమేష్ కుమార్, శంకరరాయుడు, సర్వేయర్ రాజేశ్వరరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. అనంతరం మండలాల వారీగా వినతులపై ఆరా తీశారు.

తాగునీటి సౌకర్యం కల్పిస్తాం...

● ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్...

సీతంపేట: గిరిజన గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సాక్షిలో ప్రచురితమైన 'గిరిశిఖర గ్రామాల్లో దాహం కేకలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రంగంవలసలో పీఎం జన్‌మన్‌లో భాగంగా రూ.లక్షతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద తాగునీటి సౌకర్యం కల్పించనున్నామన్నారు. ఎగువదరబ గ్రామంలో రూ.10 లక్షలతో మంచినీటి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

సీతంపేట: విశిష్ట సంఖ్య కోసం రైతులందరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేసుకోకపోతే పీఎం కిసాన్ నిధులు జమకావని స్పష్టం చేశారు. రైతులు తమ గ్రామ సహాయకుడిని సంప్రదించి, విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు అన్ని విడతల్లో నిధులు జమ అయిన వారు కూడా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంతో పాటు భద్రగిరి, ఎల్విన్‌పేట గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పనుల దృష్ట్యా ఈ అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భామినిలో..

భామిని: మండలంలోని లివిరి నుంచి కొరమ వరకు గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్యాన్సర్ మహమ్మారిని తరిమికొడదాం..



క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొడదామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఓమేగా హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ క్యాంప్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సమతుల్యమైన, ఆరోగ్యకరమైన ఆహరపదార్థాలను స్వీకరించడం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఓమేగా హాస్పటల్ సిబ్బంది, టీడీపీ నాయకులు వుదయాన ఉదయ్, జామి లక్ష్మీనారాయణ, బళ్ల హరిబాబు, మాచర్ల అనిల్ కుమార్, సారిపల్లి అచ్చుతరావు, తదితరులు పాల్గొన్నారు. - వీరఘట్టం

ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఆత్మ పీడీ రామారావు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆత్మ పీడీ రామారావు అన్నారు. కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం) గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి ఆధ్వర్యంలో జనపనార సంచుల తయారీపై శిక్షణ పొందిన మహిళలకు ఆయన ధ్రువపత్రాలను గురువారం అందజేశారు. జూట్ బ్యాగ్‌ల వినియోగంతో పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని, వాటిని తయారు చేసి, విక్రయించి స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ధ్రువ, శాస్త్రవేత్తలు ఎస్.స్రవంతి, అనంత విహారి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్..



రోగులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి వర్మ

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయుష్ వైద్యాధికారి కర్రికాసుల వర్మ అన్నారు. మండల కేంద్రంలోని హోమియో వైద్యశాలలో పలువురు రోగులకు గురువారం తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియోలో చర్మ వ్యాధులు, సుగర్, కీళ్లనొప్పులు తదితర వ్యాధులకు మంచి మందులు ఉన్నాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి హోమియోలో మంచి చికిత్సలను అందించడం జరుగుతుందన్నారు. హోమియో వైద్యం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులు పేటెంట్ హక్కులు పొందాలి

● నాబార్డ్ డీడీఎం దినేష్ రెడ్డి



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం దినేష్ రెడ్డి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసే రైతుల ఉత్పత్తులకు పేటెంట్ హక్కులు పొందేలా రూపకల్పన చేయాలని నాబార్డ్ డీడీఎం దినేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని జట్టు స్వచ్ఛంద సంస్థలో నిర్వహిస్తున్న రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ డిప్లమో కోర్సు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు వినూత్నంగా ఆలోచన చేసి నూతన వంగడాలను, ఉత్పత్తులను సృష్టించి వాటికి పేటెంట్ హక్కులు పొందితే సుస్థిర ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఉన్న దేశీయ వరి రకాలను మళ్లీ గుర్తించి వాటి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ప్రతి రైతు కుటుంబం ప్రకృతి వ్యవసాయం విధానాలను అవలంబించాలని చెప్పారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ, జట్టు ట్రస్టు సలహాదారు డి.పారినాయుడు మాట్లాడుతూ నీటి వసతిగల భూముల్లో ఏడాది పాటు పంటల సాగు ఎలా సాధ్యపడుతుందో అధ్యయనం చేయాలని మెంటర్లను, రైతు శాస్త్రవేత్తలను కోరారు. కార్యక్రమంలో బడి నుంచి పొలం బడి సిలబస్ కన్సల్టెంట్ టి. శివాజీ, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టి.శివకేశవరావుతోపాటు ప్రకృతి వ్యవసాయ కోర్సు మెంటర్ కమల, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి ..



బాల్యవివాహాలను నిర్మూలించాలని సీడీపీఓ రంగలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ఈ మేరకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన సమస్యలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి శ్రీధర్, సూపర్‌వైజర్లు హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల పాల్గొన్నారు. – సీతంపేట

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కురుపాం నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. గుమ్మలక్ష్మీపురం

విభాగం	అధ్యక్షులు		
యూత్ వింగ్	పల్ల అనంతనాయుడు	వాణిజ్య విభాగం	బోటు లక్ష్మీనారాయణ
మహిళా విభాగం	శెట్టి పద్మావతి	వీవర్స్ వింగ్	కోడి వెంకటరమణ
రైతు విభాగం	బలగ వెంకటరమణ	వైఎస్సార్ టీయూసీ	అరినాపల్లి వెంకటనాయుడు
బీసీ సెల్	బంకురు శంకర జోగినాయుడు	అంగన్‌వాడీ వింగ్	గుడారి విద్యారాణి
ఎస్సీ సెల్	నిమ్మల వెంకటరావు	లీగల్‌సెల్	కేతిరెడ్డి కూర్మినాయుడు
ఎస్టీ సెల్	బిడ్డిక అన్నాజీరావు	కల్చరల్ వింగ్	మరడాన కిశోర్‌కుమార్
మైనార్టీ సెల్	షేక్ జిలాని	సోషల్ మీడియా	షేక్ ఖాదర్ షరీఫ్
క్రిస్టియన్ మైనార్టీ సెల్	సీమల వరప్రసాద్	ఐటీ వింగ్	ఎత్తిలి మణి
స్టూడెంట్ వింగ్	జి.సుధ	దివ్యాంగుల విభాగం	తాడంగి మిన్నారావు
పంచాయతీరాజ్	ముంజి సురేష్	పబ్లిసిటీ వింగ్	గోరిశెట్టి జనార్ధనరావు
గ్రీవెన్స్ వింగ్	తెర్లి యల్లంనాయుడు	ఇంటిలెక్చువల్స్ ఫోరం	యేగిరెడ్డి సింహాచలం
		బూత్ కమిటీ	ఎం.ఉమామహేష్

భామినిలో వర్షం..

మండల కేంద్రంలో గురువారం రాత్రి వర్షం కురిసింది. ఏకధాటిగా ఓ మోస్తారు వర్షం పడడంతో ఏజీ రోడ్డులో రాకపోకలకు ప్రయాణికులు కాస్త ఇబ్బంది పడ్డారు. అలాగే గురండి సెంటర్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పలేదు. ఇదిలా ఉంటే వర్షానికి బత్తిలి నుంచి సింగడి వరకు చేపడుతున్న జల్ జీవన్ పనులకు ఆటంకం కలగనుంది. - భామిని



గురండి సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు



సింగిడిలో కురుస్తున్న వర్షపు జల్లులు

బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలి



కృత్యాలు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీఓ సుగుణ కుమారి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ పీఓ జి.సుగుణకుమారి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తమ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించుకొని పిల్లలకు గుణాత్మకమైన విద్యను అందేలా చూడాలన్నారు. మూడేళ్ల కాలంలో 120 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి జ్ఞానజ్యోతి సర్టిఫికెట్లు అందించి ప్రీ ప్రైమరీ పాఠాలు బోధించేలా అర్హత కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డీఆర్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.